సాక్షి జనగామ

శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



'సూపర్'.. సేవలు వెరీ పూర్!

ఎంజీఎం ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పాలన, పర్యవేక్షణ అధ్వానంగా మారింది. - 8లో▸



పరిశోధనలతో జ్ఞాన సముపార్జన

'వన్ నేషన్-వన్ సబ్‌స్క్రిప్షన్' ద్వారా పరిశోధన వనరులు అందుబాటులో ఉన్నాయని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36⁰ /20⁰

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. రాత్రి పూట చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



జనగామ: జిల్లా కేంద్రంలోని హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్, పోలీసు అధికారులు శుక్రవారం ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. నిర్వహణ అధ్వానంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలాజీ బార్ యజమానికి రూ.10వేలు, అమృతబార్‌కు రూ.5వేలు, భువన బార్‌కు రూ.5వేలు జరిమానా విధించి హెచ్చరికలు జారీ చేశారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశం మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కృష్ణమూర్తి, నిఖిల్, ఎస్సై రాజన్‌బాబు, పురపాలిక స్పెషల్ ఆఫీసర్ పులి శేఖర్ తనిఖీలు చేపట్టారు.

ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తే చర్యలు




జనగామ రూరల్: ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తే చర్యలు తప్పవని జిల్లా రవాణా అధికారి జీవీ.శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రం చౌరస్తాలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పొట్టు ఓవర్ లోడుతో వెళ్తున్న వాహనాన్ని సీజ్ చేశారు. ఓవర్‌లోడ్ కారణంగా ప్రమాదాలతోపాటు ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడతారని, నింబధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే చర్యలు తీసుకుంటామని అధికారి హెచ్చరించారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎకో ఫ్రెండ్లీ పర్యావరణం లక్ష్యం..



జనగామ: ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు కష్టపడి చదువుకుంటూనే.. ఎకో ఫ్రెండ్లీ పర్యావరణం లక్ష్యంగా నేటి యువత పనిచేయాలని రిడీమ్ ఇండస్ట్రీస్, ఫౌండర్, సీఈఓ అరుణ్‌కుమార్ అన్నారు. జనగామ మండలం యశ్వంతాపూర్ క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీసీ సెల్ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన 'ప్రాసెస్ ఆఫ్ ఇన్నోవేషన్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ రెడీనెస్ లెవల్, కమర్షియలైజేషన్ ఆఫ్ ల్యాబ్ టెక్నాలజీ, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ అనే ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. తమ సంస్థ ద్వారా విద్యార్థులు సమాజానికి హాని కలిగించని విధంగా బయోడీగ్రేడబుల్ బ్యాగులు తయారు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం ఎకో ఫ్రెండ్లీ పర్యావరణానికి దోహదం చేస్తుందన్నారు. సీజేఐటీలో విద్యను అభ్యసించి, ఓ కంపెనీకి సీఈఓగా ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చు కోవాలని సూచించారు. హైదరాబాద్ సందెల ఇంజనీరింగ్ కళాశాల ఎండీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సౌర, వాయు, జలశక్తి లాంటి ఆవిష్కరణలు చేసేలా విద్యార్థులు ఆలోచనలకు పదును పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీజేఐటీ కళాశాల డైరెక్టర్ డి.విజయపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఐటీసీ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.యాకూబ్, అధ్యాపకులు డాక్టర్ బి.వీరు, రఘుపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నాటికల పోటీలు



నయీంనగర్: హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో ఈనెల 23 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్లు సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ నిర్వాహకులు గన్నమరాజు గిరిజామనోహరబాబు, వనం లక్ష్మీకాంతారావు తెలిపారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పోటీలకు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేక నాటక రంగ సంస్థలను ఆహ్వానించినట్లు తెలిపారు. పోటీలకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సహకరిస్తున్నాయని పేర్కొన్నారు. వరంగల్ సహృదయులంతా కుటుంబాలతో విచ్చేసి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏవీ.నరసింహారావు, టి.లక్ష్మణరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అరకొర.. అసంపూర్తి

జిల్లాలో జాతీయ రహదారి–163 పనుల విషయంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో సర్వీస్‌రోడ్లు, సైడ్ రెయిలింగ్‌లు, డ్రెయినేజీ పనులు అరకొర.. అసంపూర్తిగా ఉన్నాయి. గడువు ముగిసి ఆరేళ్లయినా పనుల పూర్తికి మోక్షం లభించడంలేదు. ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. – స్టేషన్‌ఘన్‌పూర్



స్టేషన్‌ఘన్‌పూర్‌లో అసంపూర్తిగా ఉన్న సర్వీస్‌రోడ్డు

- ఎన్‌హెచ్–163 పనులు ఆగమాగం
- గడువు ముగిసి ఆరేళ్లయినా పూర్తికాని సర్వీసు రోడ్ల నిర్మాణం
- రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న ప్రజలు
- పట్టింపులేని పాలకులు, అధికారులు

జాతీయ రహదారి–163 విస్తరణ పనుల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2015 సంవత్సరంలో రూ.1,920 కోట్లతో యాదాద్రి–వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. ఇందులో రహదారి విస్తరణ పనులకు రూ.897.03 కోట్లు, మిగిలిన రూ.1022.97కోట్లు భూసేకరణ, ఇళ్ల యజమానులకు కేటాయించారు. 2016 జూన్ 1న నాటి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పనులకు శంకుస్థాపన చేయగా ఎల్‌అండ్‌టీ సంస్థ పనులు చేపట్టింది. యాదాద్రి జిల్లా వంగపల్లి నుంచి వరంగల్ జిల్లా ఆరెపల్లి వరకు 99.10 కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులను 30 నెలల్లో పూర్తి చేసే లక్ష్యంతో చేపట్టారు. వాస్తవానికి 2019 జనవరి వరకు పూర్తి కావలసి ఉంది. గడువు ముగిసి ఆరు సంవత్సరాలు అయినా పూర్తిస్థాయిలో పనులు చేపట్టలేదు.

జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. పెంబర్తి, లింగాలఘణపురం, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల్లో సర్వీస్ రోడ్డు పనులను పూర్తి చేయలేదు. పలుచోట్ల యూటర్న్ లేకపోవడంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహనదారులు అదనంగా దూరం తిరిగి వెనక్కి రావాల్సి వస్తున్నది.

- రఘునాథపల్లి మండలంలో సర్వీస్ రోడ్లు వేసినా ఇరుకుగా ఉన్నాయి.
- డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో సర్వీస్ రోడ్లు అసంపూర్తిగా వేశారు. స్థానిక బస్టాండ్ నుంచి శ్రీవాణి గురుకులం వరకు సర్వీస్ రోడ్డు వేయాల్సి ఉండగా కేవలం విద్యుత్ సబ్‌స్టేషన్ వరకే వేసి వదిలేశారు. దాంతో సర్వీస్ రోడ్డు నిరుపయోగంగా మారింది. ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.
- ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్‌లో రహదారికి రెండువైపులా ఇంతవరకు సర్వీస్ రోడ్డు వేయలేదు. ప్రజలు నేరుగా జాతీయ రహదారి పైకి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.
- చిల్పూరు మండలం చిన్నపెండ్యాలలో సర్వీస్ రోడ్లు, డ్రెయినేజీల పనులు అరకొరగా చేపట్టారు. అసంపూర్తి సర్వీస్ రోడ్లు, రెయిలింగ్ పనులతో ఆయా మండలాల్లో ప్రజలు పడరాని పాట్లు పాడుతున్నారు.

సర్వీస్ రోడ్లు లేక ప్రజల అవస్థలు

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గ్రామాలు ఉన్న చోట సర్వీస్ రోడ్లు వేయాలి. సర్వీస్ రోడ్డుపై నుంచి ప్రజలు నేరుగా జాతీయ రహదారిపైకి రాకుండా మధ్యలో రెయిలింగ్ ఏర్పాటు చేయాలి. సర్వీస్ రోడ్డుకు, జాతీయ రహదారికి మధ్య హైమాస్ట్ లైట్లు వేయాలి. సర్వీస్ రోడ్డు పక్కన డ్రెయినేజీలు పూర్తి చేసి మురుగు నీరు ఇళ్లలోకి రాకుండా చర్యలు చేపట్టాలి. అయితే సంబంధిత అధికారులు కేవలం జాతీయ రహదారి విస్తరణ చేశారే తప్ప.. సర్వీస్‌రోడ్లు, రెయిలింగ్ పనులను విస్మరించారు. కొన్ని గ్రామాల్లో సర్వీస్‌రోడ్లు కొంతమేర వేసి వదిలేశారు.



రాఘవాపూర్‌లో సర్వీస్‌రోడ్డు కోసం గోతులు తీసి వదిలేసిన రోడ్డు

ఘన్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అసంపూర్తిగా రోడ్డు

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



ఘన్‌పూర్‌లో సర్వీసు రోడ్లకు సంబంధించి పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు అరిగోస పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి ఘన్‌పూర్‌తో పాటు గ్రామాల్లో సర్వీసు రోడ్లు, డ్రెయినేజీ పనులను త్వరగా చేపట్టాలి.
- కొలిపాక సతీష్, స్టేషన్‌ఘన్‌పూర్

చాలా ఇబ్బందిగా ఉంది



రాఘవాపూర్‌లో జాతీయ రహదారికి రెండుపక్కలా సర్వీసు రోడ్ల నిర్మాణం చేయలేదు. గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు. సర్వీసురోడ్డు ఏర్పాటు చేసి సమస్య తీర్చాలి.
- నల్లతీగల లక్ష్మయ్య, రాఘవాపూర్

అధికారులు నిర్లక్ష్యం వీడాలి..



జాతీయ రహదారి పనులకు గడువు పూర్తయి ఆరేళ్లవుతున్నా సర్వీసురోడ్ల పనులు పూర్తి చేయకపోవడం అధికారుల తీరుకు నిదర్శనం. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపులేదు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి వెంటనే పనులు చేయించాలి.
- శానబోయిన నగేష్, శివునిపల్లి

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

జనగామ రూరల్: స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రాబోయే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్లు, పోలింగ్, పోస్టల్ బ్యాలెట్, కౌంటింగ్ విధులపై నోడల్ అధికారులు, స్టేజ్–1 రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, స్టేజ్–2 రిటర్నింగ్ అధికారులకు శుక్రవారం కలెక్టరేట్‌లో జెడ్పీ, జీపీ విభాగాల ఆధ్వర్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నామినేషన్ల ప్రక్రియ నుంచి ఓట్ల లెక్కింపు వరకు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. బ్యాలెట్ పత్రాల ద్వారా నిర్వహించే ఈ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రతి దశలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల సంఘం ద్వారా అందించిన కరదీపికను చదువుకొని సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. సందేహాలు ఉంటే మండలాల వారీగా నియమించిన మాస్టర్ ట్రైనర్‌లను అడిగి నివృత్తి చేసుకోవాలని చెప్పారు. జిల్లాలో మొత్తం 2,543 పోలింగ్ కేంద్రాలకు గాను ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి 783 ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణకు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి స్టేజ్–1, 2కు సంబంధించి ఆర్‌ఓలు 75, ఏఆర్‌ఓలు 150 మంది చొప్పున, జెడ్పీటీసీ ఎన్నికలకు ఆర్‌ఓలు 13 మంది, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు 55 మంది చొప్పున, ఎంపీడీఓలు, ఎంపీఓలు హాజరయ్యారు. అంతకుముందు మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల విధుల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జెడ్పీ సీఈఓ మాధురీ షా, డిప్యూటీ జెడ్పీ సీఈఓ సరిత, డీపీఓ స్వరూప తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

విద్యుత్ అవసరాలకు తగ్గట్టుగా చర్యలు

- ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ వేణుమాధవ్



మాట్లాడుతున్న ఎస్‌ఈ వేణుమాధవ్

జనగామ: వినియోగదారుల డిమాండ్‌కు తగ్గట్టుగా మరింత నాణ్యతతో కూడిన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్పీడీసీఎల్ జిల్లా ఎస్‌ఈ టి.వేణుమాధవ్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జనగామ సర్కిల్ పరిధిలో ప్రస్తుత నెల 12వ తేదీ రోజున గరిష్ట విద్యుత్ డిమాండ్ 5.75 మిలియన్ యూనిట్లు నమోదు కాగా.. రాబోయే మూడు నెలల్లోనూ గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. గత మూడు నెలల నుంచే వేసవి కాలం ముందస్తు కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని, ఆ మేరకు కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ముందు ఎక్కడెక్కడ అదనపు లోడ్ పెరుగుతుందో నిర్ధారించుకుని కొత్తగా 32 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని, అలాగే 45 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచి, 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో నూతనంగా 5 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను బిగించినట్లు వివరించారు. అత్యవసర సమయంలో ప్రత్యామ్నాయ లైన్(ఇంటర్ లింకు) ద్వారా విద్యుత్ సరఫరా చేయడానికి కొత్తగా రెండు ఇంటర్ లింకింగ్ లైన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. మెరుగైన, కోతలు లేని విద్యుత్ సరఫరా కోసం కొత్త ఫీడర్లను సైతం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్ 1912

విద్యుత్ వినియోగదారులకు 24 గంటల పాటు సేవలందిస్తున్నామని, సమస్యలు ఉత్పన్నమైతే టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలన్నారు. ట్రాన్స్ ఫార్మర్లు ఫెయిల్యూర్, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, లోవోల్టేజీ, బ్రేక్ డౌన్స్, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, తీగలు, విద్యుత్ బిల్లుల్లో తేడాలు, పేరు మార్పు, మీటర్లలో సాంకేతిక సమస్య, సర్వీసు రద్దు తదితరాలకు టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సమాచారం అందుకున్న వెంటనే సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

ఉమ్మడి ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరావు

జనగామ రూరల్ : రాష్ట్రంలోని గురుకులాల్లో ప్రవేశం కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి మొత్తం 1,851 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, ఈనెల 23న ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు జిల్లా పరిధిలో తొమ్మిది సెంటర్లు కేటాయించామని తెలిపారు. నిర్దేశిత సమయానికి గంట ముందే సెంటర్‌లోకి అనుమతిస్తారని, ప్రతీ విద్యార్థి హాల్ టికెట్, పరీక్ష ప్యాడ్, బ్లూ, బ్లాక్ పెన్ తప్పనిసరి వెంట తెచ్చుకోవాలని సూచించారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ భాస్కర్‌రావు

బచ్చన్నపేట : కొడవటూర్‌లోని స్వయంభూ శ్రీ సిద్దేశ్వరాలయంలో మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని దేవాదాయ శాఖ నల్లగొండ సహాయ కమిషనర్ భాస్కర్‌రావు ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, శివరాత్రి రోజున శివపార్వతుల కల్యాణం ఉంటుందని చెప్పారు. కల్యాణానికి వచ్చే వేలాది మంది భక్తులకు వసతుల కల్పనలో లోటు లేకుండా చూడాలన్నారు. కట్టుదిట్టమైన భద్రత, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, కార్యనిర్వహణాధికారి చిందం వంశీ, ప్రధాన పూజారి ఓం నమఃశివాయ, డైరెక్టర్ నిమ్మ కర్ణాకర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



పాలకుర్తిలో లడ్డూ తయారీని పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ భాస్కర్

పాలకుర్తిలో ఏర్పాట్ల పరిశీలన

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు జరిగే మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను శుక్రవారం దేవాలయ ధర్మాదాయ శాఖ నల్లగొండ సహాయ కమిషన్ కె.భాస్కర్ పరిశీలించారు. ఆలయంలో భక్తుల కోసం క్యూలైన్, చలువ పందిళ్లు ఏర్పాటు చేయగా.. సందర్శించారు. లడ్డూ తయారీని పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, సూపరింటెండెట్ కొత్తపల్లి వెంటకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బంజారాల అభివృద్ధికి కృషి

- సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్: ప్రతి తండాలో తాగునీటి వసతి కల్పించడంతోపాటు బంజారాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎంఆర్ గార్డెన్‌లో డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. తన వంతు సహకారంగా బంజారా భవనానికి భూమి, అలాగే జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడానికి సేవాలాల్ మహరాజ్ విగ్రహం ఇప్పిస్తానని చెప్పారు. డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా బంజారా భవనం నిర్మాణానికి సహకరించటం లేదని, బంజారాల ఓట్లతో గెలిచిన నాయకులు గిరిజనుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు చౌరస్తా నుంచి లంబాడీ మహిళలు సంప్రదాయ నృత్యాలతో ర్యాలీగా వచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అజ్మీరా స్వామినాయక్, సేవాలాల్ జయంతి స్పెషల్ ఆఫీసర్ రూపరాణి, మాజీ కౌన్సిలర్ అనిత, జిల్లా వైద్యులు బాలాజీనాయక్, శంకర్‌నాయక్, కొర్ర కాలురామ్‌నాయక్, ధర్మ భిక్షం, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాంకోటి, బానోతు రవి, గోవర్ధన్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన మహిళలతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికలపై అలర్ట్!

- ఏర్పాట్లపై కలెక్టర్లకు సీఈఓ సుదర్శన్‌రెడ్డి ఆదేశం
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- ఉమ్మడి జిల్లాలో 10,797 మంది ఓటర్లు
- 27న పోలింగ్.. మార్చి 3న లెక్కింపు
- ప్రచారంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు

సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్–నల్లగొండ–ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల పోలింగ్‌కు ఐదు రోజులే గడువుంది. అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో ఉండగా.. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆరు జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులను అలర్ట్ చేశారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన సుదర్శన్‌రెడ్డి, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయాలన్నారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో.. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా నిఘా పటిష్టం చేయాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను జిల్లాల్లో పకడ్బందీగా అమలు చేయాలని, డబ్బు, మద్యం, ఆభరణాలు, పరికరాల ద్వారా ఓటర్లను ప్రభావితం చేయకుండా జాగ్రత్త పడాలని, క్షేత్రస్థాయి నుంచి వచ్చే సమాచారంతో దాడులు నిర్వహిస్తూ వీటిని నిరోధించాలని చెప్పారు.

ఏర్పాట్లలో అధికారులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన మేర సౌకర్యాలు ఉండేలా ఇప్పటికే అధికారులు చర్యలు చేపట్టారు. పూర్వ వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో 24,905 ఓట్లు ఉండగా.. ఉమ్మడి వరంగల్ పరిధి ఆరు జిల్లాల్లో 6,509 పురుషులు, 4,288 స్త్రీలు కలిపి 10,797 మంది ఓటర్లున్నారు. ఆరు జిల్లాల్లోని 70 మండలాల్లో ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనుండగా.. 72 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ నిరంతరం పని చేసేలా విద్యుత్ సరఫరా ఏర్పాట్లపై స్థానికులతో మాట్లాడుతున్నారు. అలాగే.. 27న జరిగే పోలింగ్ కోసం ఒక్కరోజు ముందే ఎన్నికల సామగ్రిని తరలించేలా జిల్లాకేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లవద్ద అవసరమైన వసతులపై కసరత్తు చేస్తున్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఉదయం 8 గంట లకు పోలింగ్ ప్రారంభమయ్యేలా, ప్రతీ రెండు గంటలకు పోలింగ్ వివరాలు ప్రకటించేలా ఎన్నికల అధికారులు, సిబ్బందిని కలెక్టర్లు సంసిద్ధం చేస్తున్నారు.

వేడెక్కిన ప్రచారం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం 23 మంది 50 సెట్లు నామినేషన్లు దాఖలు చేయగా.. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత 19 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. బరిలో అలుగుబెల్లి నర్సిరెడ్డి–స్వతంత్ర(యూటీఎఫ్ మద్దతు), గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి – స్వతంత్ర (టీచర్స్ జేఏసీ మద్దతు), పులి సరోత్తంరెడ్డి – బీజేపీ (టీపీయూఎస్ మద్దతు), శ్రీపాల్‌రెడ్డి పింగిళి–స్వతంత్ర (పీఆర్టీయూ– టీఎస్ మద్దతు), పూల రవీందర్ – స్వతంత్ర (ఎస్టీ యూ మద్దతు)తో పాటు స్వతంత్రులుగా సంగంరెడ్డి సుందర్‌రాజు, కొలిపాక వెంకటస్వామి, అర్వ స్వాతి, కంటె సాయన్న, పన్నాల గోపాల్‌రెడ్డి ఏలె చంద్రమోహన్, చాలిక చంద్రశేఖర్, జంకిటి కైలాసం, జి.శంకర్, తలకోల పురుషోత్తంరెడ్డి, తాటికొండ వెంకటరాజయ్య, దామెర బాబురావు, బంక రాజు, ప్రజావాణి పార్టీ నుంచి లింగిడి వెంకటేశ్వర్లు పోటీలో ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు మరో ఐదు రోజులే గడువుండడంతో అభ్యర్థులు తమదైన శైలిలో ప్రచారంలో హోరెత్తిస్తున్నారు.



జనగామ కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ చేతన్‌నితిన్

పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశాం

అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

జనగామ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. సీఈఓ వీసీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు మండలాలకు ఒక రూట్ చొప్పున నాలుగు రూట్లు ఏర్పాటు చేశామని, సెక్టోరియల్ అధికారులకు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్‌లకు విధులు కేటాయించినట్లు వివరించారు. అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ పండారి చేతన్‌నితిన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలిలా..

జిల్లా	మండలాలు	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	మొత్తం
హనుమకొండ	11	15	2884	2214	5098
వరంగల్	13	13	1381	844	2225
జనగామ	12	12	556	365	921
మహబూబాబాద్	18	16	1083	535	1618
భూపాలపల్లి	07	07	211	112	323
ములుగు	09	09	394	218	612
మొత్తం	70	72	6,509	4,288	10,797



జగదల్పూర్‌కు ఓరుగల్లు పేరిణి కళాకారులు


పేరిణి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు (ఫైల్)

హన్మకొండ కల్చరల్‌: కాకతీయుల కళా సృష్టి పేరిణి నృత్యం.. దీనిని భారతదేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తోంది. ఛత్తీస్‌గఢ్‌ జగదల్పూర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన కాకతీయుల వంశీయుడు కమల్‌ చంద్రభంజు దేవ్‌ వివాహ మహోత్సవంలో గజ్జల రంజిత్‌కుమార్‌ ఆధ్వర్యంలో పేరిణి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. వరంగల్‌ నుంచి నృత్యకళాకారులు పల్నాటి శ్రీజ, రామ చరణి, గడ్డం విద్యశ్రీ, జెట్టి రిత్విక, పెడిసోజు సమీక్ష, గుండా చరిష్మా ఆకుల లక్ష్మీ ప్రసన్న, తుమ్మ వైష్ణవిలు బయల్దేరి వెళ్లినట్లు రంజిత్‌కుమార్‌ తెలిపారు.

నూతన టెక్నాలజీతో 'మిత్ర సుజికీ'



మహబూబాబాద్‌ అర్బన్‌: నూతన టెక్నాలజీతో పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో మిత్ర సుజికీ ద్విచక్రవాహనం తీసుకువచ్చామని షోరూం జోనల్‌ మేనేజర్‌ ప్రమోద్‌పాండే, ఏరియా మేనేజర్‌ వెంకటేష్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇల్లెందు బైపాస్‌ యశోద గార్డెన్‌ సమీపంలో శుక్రవారం బైక్‌ షోరూంను వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు వినియోగార్థం అందుబాటు ధరల్లో మార్కెట్‌లోకి నూతన మోడల్‌ను విడుదల చేశామన్నారు.

అట్టహాసంగా ఆలిండియా టోర్నమెంట్స్‌ షురూ

కాజీపేట అర్బన్‌ : నిట్‌ వరంగల్‌లోని మైదానంలో శుక్రవారం అట్టహాసంగా మూడు రోజుల ఆల్‌ ఇండియా ఇంటర్‌ ఎన్‌ఐటీ టోర్నమెంట్స్‌ ప్రారంభమయ్యాయి. టోర్నమెంట్స్‌ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ వాలీబాల్‌ క్రీడాకారుడు జీఆర్‌ కిరణ్‌ పాల్గొని టోర్నమెంట్స్‌ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దేశవ్యాప్త ఎన్‌ఐటీల నుంచి 775 మంది విద్యార్థులు టోర్నమెంట్లలో పాల్గొననున్నట్లు డీన్‌ శ్రీనివాసాచార్య తెలిపారు. మూడు రోజుల టోర్నమెంట్లలో భాగంగా హ్యాండ్‌బాల్‌, వాలీబాల్‌, యోగా పోటీల్లో విద్యార్థులు పోటీ పడనున్నట్లు స్పోర్ట్స్‌ యాక్టివిటీస్‌ హెడ్‌ పి.రవికుమార్‌ తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌ అజీమ్‌, దయానిధి, పాల్గొన్నారు.




మట్టెవాడ పోలీస్‌ స్టేషన్‌ పరిధి పోచమ్మమైదాన్‌ వాసవీకాలనీలో గురువారం ఉర్సు ప్రాంతానికి చెందిన కోట చంద్రశేఖర్‌ కట్టుకున్న భార్య, అత్తామామలపై కత్తితో తీవ్రంగా దాడి చేసి గాయపర్చి పరారయ్యాడు. ఇప్పటి వరకు పోలీసులు అతడిని పట్టుకోలేదు.

మిల్స్‌కాలనీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో అమ్మవారిపేట, భట్టుపల్లి గ్రామాల మధ్య గురువారం రాత్రి గాదె సుమంత్‌రెడ్డి అనే వైద్యుడి కారును అడ్డగించి కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉన్న అతడిని చూసిన ప్రయాణికులు డయల్‌-100కు సమాచారం అందించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ 24 గంటలు గడిచినా కేసు కొలిక్కి రాలేదు.

కాజీపేట సబ్‌ డివిజన్‌, హసన్‌పర్తి ఠాణా పరిధిలోని మడిపల్లి గ్రామంలో ఓ వివాహ వేడుకలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. అయితే ఒక వర్గానికి చెందిన ఇద్దరు ప్రణాళిక ప్రకారం వేట కత్తులతో నలుగురిపై దాడి చేసిన సంఘటన బీభత్సం సృష్టించింది. నలుగురిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. నిందితులిద్దరి వివరాలు తెలిసినప్పటికీ పోలీసులు అరెస్టు చేయలేకపోయారు.

ఇవి గ్రేటర్‌ వరంగల్‌ నగర పరిధిలో గురువారం ఒక్కరోజే జరిగిన సంఘటనలు. కత్తులు..రాడ్లతో దాడులు జరుగుతుంటే నిఘా వ్యవస్థ నిద్రపోతుందా.? ఇన్‌ఫార్మర్‌ వ్యవస్థ కుప్పకూలిపోయిందా అనే అనుమానాలు కలుగుతున్నాయి

భయం గుప్పిట్లో నగరం.!



నగరంలో హత్యలు.. హత్యాయత్నాలు
- గురువారం ఒక్కరోజే మూడు ఘటనలు
- బెంబేలెత్తుతున్న నగరవాసులు

వరంగల్‌ క్రైం : వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధి ట్రైసిటీలో వరుస సంఘటనలు నగరవాసులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా వరంగల్‌ పోలీస్‌ బాస్‌ అర్ధరాత్రి వేళ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పోలీసుల్లో ఉత్తేజాన్ని నింపుతున్నా.. కొందరు అధికారుల్లో పేరుకుపోయిన నిద్రమత్తు మాత్రం వదలడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిఘా వ్యవస్థ, ముందస్తు సమాచారం సేకరించడంలో, సంఘటన జరిగి 24 గంటల గడుస్తున్నా.. హత్యాయత్నాలకు తెగబడిన వారిని పట్టుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మారని పోలీసుల తీరు..

వరుసగా దొంగతనాలు.. దోపిడీలు, హత్యలు, హత్యాయత్నాలు జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ట్రైసిటీతోపాటు చుట్టుపక్కల ఉన్న చాలామంది ఇన్‌స్పెక్టర్లు ఏసీ గది దాటి బయటకు రావడం లేదనే విమర్శలున్నాయి. వరంగల్‌ సబ్‌ డివిజన్‌లోని ఓ స్టేషన్‌, హనుమకొండ సబ్‌ డివిజన్‌లో ఓ పోలీస్‌ స్టేషన్‌ సాయంత్రం అయితే చాలు జాతరను తలపిస్తూ కాసుల వర్షం కురిపిస్తున్నట్లు పోలీస్‌శాఖలో జోరుగా ప్రచారం ఉంది. పంచాయితీలకే పోలీసులు పరిమితం కావడంతో క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. పోలీస్‌ స్టేషన్‌ పరిధి, ఏసీపీ, డీసీపీ, సీపీ పరిధిలో ప్రతినెలా జరుగుతున్న నేర సమీక్షలో అధికారులు ఏం అడుగుతున్నారు. కింది స్థాయి అధికారులు ఏం సమాధానం చెబుతున్నారు.? ఎవరికి అంతుపట్టని రహస్యం. ఏదైనా సంఘటన జరిగినప్పుడే హడావుడి చేసి చేతులు దులుపుకొని యథావిధిగా వారి పంచాయితీలకే ప్రాధాన్యం ఇస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు ఎందుకు చర్య తీసుకోవడం లేదనే? విమర్శలున్నాయి.

వైద్యుడు చనిపోయాడనే వెళ్లిపోయారా?



కాజీపేట సిద్దార్థనగర్‌లోని షిర్డిసాయినగర్‌కు చెందిన డాక్టర్‌ గాదె సుమంత్‌ రెడ్డి (37) జనరల్‌ ఫిజీషియన్‌. గురువారం రాత్రి క్లినిక్‌ మూసివేసి స్నేహితుడిని కలిసేందుకు భట్టుపల్లి మీదుగా వరంగల్‌కు బయల్దేరగా.. గుర్తు తెలియని దుండగులు కారును అడ్డగించి.. దాడి చేశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో చనిపోయి ఉంటాడని భావించి దుండగులు వెళ్లిపోయినట్లు భావిస్తున్నారు. సుమంత్‌ రెడ్డి తండ్రి ఆరోగ్య సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు శుక్రవారం మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీపీ ఆదేశాల మేరకు పోలీసులు మరోసారి ఘటన స్థలానికి చేరుకుని, క్షుణ్ణంగా పరిశీలించారు. దుండుగులు ఎలా వచ్చి ఉంటారూ.. తిరిగి ఎలా వెళ్లిపోయారు.. దాడి చేసింది ఎవరై ఉంటారు.. అనే విషయాలపై చర్చించుకున్నారు. కాగా, సుమంత్‌ రెడ్డి కారును మరో కారులో దుండగులు కాజీపేటనుంచే వెంబడించగా, మరికొందరు ఘటనస్థలి వద్ద కాపుకాసినట్లు తెలిసింది. ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారమే దాడి జరిగినట్లు స్పష్టమవుతోంది. దాడికి వివాహేతర సంబంధమా.. మరే ఇతర కారణమా అనేది తెలియాల్సి ఉంది.

అసాంఘిక శక్తులకు అడ్డా.. భట్టుపల్లి రోడ్డు

ఖిలా వరంగల్‌ : భట్టుపల్లి రోడ్డుపై జరుగుతున్న దాడులతో ప్రయాణికులు, స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. కాజీపేట నుంచి వరంగల్‌కు వెళ్లేందుకు ఈ రోడ్డుపై ప్రయాణించాల్సిందే. ఇటీవల జరుగుతున్న దాడులతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయం.. భయంగా వెళ్లాల్సి వస్తోంది. ఈరోడ్డుపై పెద్దగా వాహనాల రద్దీ ఉండకపోవడం.. జనసంచారం చాలా తక్కువగా ఉండడం వల్ల పగలు, రాత్రి నిర్మానుష్యంగా ఉంటుంది. అయితే ఓ వైపు గుట్టలు, భారీ చెట్లు, ముళ్లపొదలు.. మరోపక్క నిర్మానుష్య ప్రాంతాలు ఉండడం వల్ల నగరంలోని గంజాయి, మద్యం పోకిరీలు ఇక్కడే తిష్టవేసి ఉంటారనే ఆరోపణలున్నాయి. ఎవరైనా బైక్‌పై ఒంటరిగా వెళ్తుంటే బెదిరించి దోపిడీకి తెగబడుతున్నారని వాహనదారులు చెబుతున్నారు. వరంగల్‌-ఖమ్మం జాతీయ రహదారి నిర్వహణ సిబ్బంది, పెట్రోలింగ్‌ వాహనాల గస్తీ తిరుగుతున్నా దుండగులు నిర్భయంగా దాడులకు పాల్పడడం పోలీసులకు సవాల్‌గా మారింది.

మరికొన్ని ఘటనలు..

- రెండు నెలల క్రితం భట్టుపల్లి సమీపంలోని అమ్మవారిపేట క్రాస్‌ రోడ్డు వద్ద ఓ మహిళా దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ రోడ్డుపై నిర్జీవ ప్రదేశాలు ఎక్కువగా ఉండడం, సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల ఆకతాయిలు, మద్యం, గంజాయికి బానిసైన వారు ఎక్కువగా సంచరిస్తూ దాడులు, దోపిడీలకు తెగబడుతున్నారు.
- గతేడాది ఓ ఇంటెలిజెన్స్‌ కానిస్టేబుల్‌ విధులు ముగించుకుని బైక్‌ పై రాత్రి కాజీపేట మీదుగా వరంగల్‌కు బయలుదేరాడు. అయితే అమ్మవారిపేట క్రాస్‌ రోడ్డు సమీపానికి రాగానే కొందరు బైక్‌ను అడ్డగించి చితకబాదారు. కానిస్టేబుల్‌ వద్ద నగదు లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు.
- గతేడాది భట్టుపల్లి రోడ్డుపై ఓ లారీ డ్రైవర్‌ మీద దుండగులు దాడి చేసి, బెదిరించి సెల్‌ఫోన్‌, నగదు దోచుకున్నారు. ఇతర రాష్ట్రాల లారీ డ్రైవర్‌ ఫిర్యాదు చేయకుండానే వెళ్లిపోయారు. కానీ మిల్స్‌కాలనీ స్టేషన్‌ పరిధి ఓ చోరీ కేసులో దొంగలు పట్టుబడగా, విచారణలో భట్టుపల్లిలో చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు.

పరిశోధనలతో జ్ఞాన సముపార్జన

- జాతీయ సదస్సులో కేయూ రిజిస్ట్రార్‌ రామచంద్రం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న రిజిస్ట్రార్‌ రామచంద్రం తదితరులు

కేయూ క్యాంపస్‌ : 'వన్‌ నేషన్‌-వన్‌ సబ్‌స్క్రిప్షన్‌' ద్వారా పరిశోధన వనరులు అందుబాటులో ఉన్నాయి. దీంతో పరిశోధనలకు అవసరమైన జ్ఞాన సముపార్జనకు దోహదం చేస్తోందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ వి.రామచంద్రం పేర్కొన్నారు. కేంద్ర గ్రంథాలయం, లైబ్రరీ సైన్స్‌ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కేయూలోని సెనేట్‌హాల్‌లో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బెంగళూరు ఇన్ఫర్మేషన్‌ అండ్‌ లైబ్రరీ నెట్‌వర్క్‌ సంచాలకులు ప్రొఫెసర్‌ దేవిక పి మదాలి కీలకపోన్యాసం చేస్తూ గతంలో చాలా విలువైన జర్నల్స్‌ కొద్దిమంది పరిశోధకులకు మాత్రమే అందుబాటులో ఉండేవని వివరించారు. ఇప్పుడు వన్‌ నేషన్‌-వన్‌ సబ్‌స్క్రిప్షన్‌ ద్వారా యాక్సెస్‌ పెరిగిందన్నారు. దేశంలోని అన్ని వ్యక్తిగత విభాగాలకు చెందిన ప్రముఖ ప్రచురణ కర్తల నుంచి పరిశోధన జర్నల్స్‌కు ప్రాధాన్యత అందించడం దార్శనికత ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ సదస్సులో వివిధ విభాగాల డీన్లు మాట్లాడారు. విద్యార్థులు, పరిశోధకులు, లైబ్రరీ విభాగం బోధన, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

'పీఎం కుసుమ్‌' గడువు పెంపు

- మార్చి 2వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ


మహేందర్‌ రెడ్డి, రెడ్‌కో ఉమ్మడి వరంగల్‌ జిల్లా మేనేజర్‌

హన్మకొండ : ప్రధానమంత్రి కిసాన్‌ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్‌ మహాభియాన్‌ (పీఎం కుసుమ్‌) పథకంలో భాగంగా సోలార్‌ ప్లాంట్‌ ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తు గడువును ప్రభుత్వం పెంచిందని రెడ్‌ కో ఉమ్మడి వరంగల్‌ జిల్లా మేనేజర్‌ మహేందర్‌ రెడ్డి పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు, రైతు ఉత్పత్తి సంఘాలు, డెవలపర్స్‌, సహకార సంఘాలు మార్చి 2వ తేదీ వరకు రెడ్‌ కో వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటి ఉమ్మడి వరంగల్‌ జిల్లా వ్యాప్తంగా 98 సోలార్‌ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జనగామ జిల్లా- 32, భూపాలపల్లి-10, మహబూబాబాద్‌-20, వరంగల్‌-23, హనుమకొండ-11, ములుగు జిల్లా నుంచి 2 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. సోలార్‌ ప్లాంట్‌ ఏర్పాటు చేసే ప్రదేశం 33/11 కేవీ సబ్‌ స్టేషన్‌కు 5 కిలో మీటర్ల లోపు దూరం మాత్రమే ఉండాలని చెప్పారు. 500 కిలో వాట్ల నుంచి 2 మెగావాట్ల ఉత్పత్తి వరకు సోలార్‌ ప్లాంట్‌ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. 25 సంవత్సరాల పాటు విద్యుత్‌ ఉత్పత్తి జరుగుతుందని, ఒక్క మెగావాట్‌ ప్లాంట్‌కు రూ.3 కోట్ల వ్యయం కానుందని, ఇందులో బ్యాంకు 70 శాతం రుణం అందిస్తోందని, మిగతా సొమ్ము ప్లాంట్‌ ఏర్పాటు చేసే వారు భరించాల్సి ఉంటుందన్నారు. రోజుకు దాదాపుగా 4,500 యూనిట్లు విద్యుత్‌ ఉత్పత్తి జరుగుతుందని, యూనిట్‌కు డిస్కంలు రూ.3.13 చొప్పున చెల్లిస్తాయని వివరించారు.

లిఫ్ట్‌లో ఇరుక్కున్న మెకానిక్‌

- గోడకు రంధ్రం చేసి కాపాడిన పోలీసులు


అంజిని బయటకు తీస్తున్న పోలీసు, అగ్నిమాపక సిబ్బంది

వరంగల్‌: ఓ హోటల్‌లో లిఫ్ట్‌ మరమ్మతుల కోసం వచ్చిన ఓ వ్యక్తి అందులో ఇరుక్కున్నట్లు డయల్‌-100 నుంచి అందిన ఫిర్యాదు మేరకు అతన్ని రక్షించి అస్పత్రికి తరలించామని ఇంతేజార్‌గంజ్‌ ఇన్‌స్పెక్టర్‌ షుకుర్‌ తెలిపారు. వరంగల్‌ స్టేషన్‌ రోడ్‌లోని గ్రాండ్‌ గాయత్రి హోటల్‌లో లిఫ్ట్‌ గ్రౌండ్‌ చాంబర్‌లో లోపాలను సరిదిద్దేందుకు శుక్రవారం మెకానిక్‌ అంజి లోపలికి దిగాడు. అనుకోకుండా లిఫ్ట్‌ కిందికి రావడంతో ఇరుక్కుపోయాడు. లిఫ్ట్‌ ఎంతకీ పైకి కదలకపోవడంతో అక్కడే ఉన్న హోటల్‌ సిబ్బంది 100కు డయల్‌ చేసినట్లు తెలిసింది. ఫిర్యాదు అందుకున్న ఇంతేజార్‌గంజ్‌ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్న సహాయ చర్యలు చేపట్టారు. లిఫ్ట్‌ పైకి లేపేందుకు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో సెల్లార్‌లోని గ్రౌండ్‌ చాంబర్‌ గోడకు రంధ్రం చేసి అంజిని బయటకు తీశారు. 108 వాహనంలో వైద్యసేవల కోసం ఎంజీఎంకు తరలించారు. ఈ ఘటనలో మెకానిక్‌ అంజి కాలు విరిగినట్లు వైద్యులు తెలిపారు. హోటల్‌లో జరిగిన ఘటనపై ఫిర్యాదులు వస్తే కేసు నమోదు చేసి విచారణ చేపడతామని స్థానిక పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులు తెలిపారు.

'సూపర్‌'.. సేవలు వెరీ పూర్‌!

- సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రిలో మూడు గంటలే వైద్యుల విధులు
- పారామెడికల్‌ సిబ్బంది అయితే 8 గంటలకు బదులు 4 గంటలే..
- తాజా, మాజీ ప్రజాప్రతినిధుల అనుచరుల నియామకం
- ఇదేంటని ప్రశ్నిస్తే.. అధికారులపై 'రాజకీయ' ఒత్తిళ్లు



"పై ఫొటో చూడండి సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రిలో కార్డియాలజీ విభాగం ఓపీ దగ్గరి పరిస్థితి. శుక్రవారం ఈ విభాగం ఓపీ సేవలను అందిస్తారు. ఉదయం 9 గంటల సమయానికి 100 మంది రోగులు ఓపీ స్లిప్‌లు తీసుకుని కూర్చున్నారు. 9 గంటలకు రావాల్సిన వైద్యులు 9.25గంటలు దాటినా రాలేదు. 12 గంటలు కొట్టగానే ఠంచనుగా ఓపీ సేవలను మూసివేస్తారు. మూడు గంటల పాటు చూడాల్సిన ఓపీని.. 2 గంటల నుంచి 2.30 గంటల వరకు చూస్తే.. వచ్చిన వందమంది రోగులను ఎలా పరీక్షిస్తారన్నది వైద్యులకే తెలియాలి."

ఎంజీఎం : వరంగల్‌ మహాత్మాగాంధీ మెమోరియల్‌ (ఎంజీఎం) ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రిలో పాలన, పర్యవేక్షణ అధ్వానంగా మారింది. ఎవరు.. ఎప్పుడు విధులకు వస్తారో.. డుమ్మా కొడుతారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. సూపర్‌ ఆస్పత్రి పాలనపై ఎంజీఎం పరిపాలనాధికారులు పూర్తిస్థాయి దృష్టి సారించకపోవడంతో ఇక్కడి వైద్యులు, సిబ్బంది చుట్టపు చూపుగా విధులు నిర్వర్తిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సూపర్‌ ఆస్పత్రిలో పోస్టింగ్‌ కేటాయిస్తే పారామెడికల్‌, ఔట్‌ సోర్సింగ్‌ సిబ్బంది ఎగిరి గంతులు వేస్తున్నారు. నాలుగైదు గంటల్లో విధులు ముగియడం, అడిగే వారు ఉండకపోవడే ఇందుకు కారణం.

ఆస్పత్రిలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యే అనుచరుల నియామకం..

సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రిలో గత ప్రభుత్వ హయాంలో మూడు ఔట్‌ సోర్సింగ్‌ ఏజెన్సీల ద్వారా తాజా, మాజీ ప్రజాప్రతినిధుల అనుచరులను ఆయా విభాగాల్లో నియమించారు. ఆస్పత్రి మొత్తంగా పారామెడికల్‌ సిబ్బంది 110మంది ఉంటారు. కాగా, తాజా, మాజీ ప్రజాప్రతినిధుల హయాంలో ఒక్కో ఏజెన్సీలో 27మందిని తీసుకున్నారు. సదరు పారామెడికల్‌ సిబ్బంది నియామకం చేపట్టినప్పటినుంచి నినిమిది గంటల విధులకు బదులు నాలుగు గంటలు నిర్వర్తిస్తూ ఇదేమని ప్రశ్నిస్తే అధికారులపై 'రాజకీయ' ఒత్తిళ్లు తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి వారి బయోమెట్రిక్‌ అటెండెన్స్‌ను పరిశీలిస్తే వారు ఎన్ని గంటలు విధులు చేస్తున్నారో బయట పడుతుందని కొందరు చెబుతున్నారు.

మూడు గంటల వైద్యుల విధులు..

సూపర్‌ ఆస్పత్రికి వచ్చే వైద్యుల విధులు చుట్టపు చూపులాగానే ఉన్నాయి. ఓపీ ఉన్న రోజుల్లో 9 నుంచి 12 గంటల వరకు విధులు నిర్వర్తించాలి. ఓపీ కూడా పలు విభాగాలకు వారానికి రెండు రోజులు మాత్రమే ఉంటుంది. ఆ రోజుల్లో సైతం సమయానికి రాకుండా 9.30 గంటల తరువాత హాజరువుతూ 12 దాటక ముందే వారివారి క్లినిక్‌లకు పరుగులు పెడుతున్నట్లు రోగులు వాపోతున్నారు. ఇదంతా ఆస్పత్రి ఆర్‌ఎంఓలకు తెలిసినా 'వైద్యుల్ని ప్రశ్నించేస్థాయి మాది కాదు. సూపరింటెండెంట్‌, డీఎంఈ స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలి' అని దాటవేస్తున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తాం..



సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రికి డిప్యూటీ మెడికల్‌ సూపరింటెండెంట్‌ను నియమించాం. పారామెడికల్‌ సిబ్బంది, వైద్యుల విధులపై విభాగాధిపతులతో చర్చించి చర్యలు తీసుకుంటాం. బయోమెట్రిక్‌ను పరిశీలిస్తాం. రోగులకు మెరుగైన సేవలందిస్తాం.

- డాక్టర్‌ కిశోర్‌, ఎంజీఎం సూపరింటెండెంట్‌

రాజలింగమూర్తి హత్య కేసులో నిందితులు ఎందరు..?

- పోలీసుల అదుపులో సుమారు పదిమంది
- ప్రత్యక్షంగా పాల్గొన్నది నలుగురేనా..
- ఆర్థికంగా, పరోక్షంగా సహకరించింది ఎంతమంది.. ?
- రెండు రోజులుగా విచారిస్తున్న పోలీసులు
- కొత్త హరిబాబును అదుపులోకి తీసుకునేందుకు యత్నం

భూపాలపల్లి : దారుణ హత్యకు గురైన సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి కేసు రోజుకో మలుపుతిరుగుతోంది. హత్యకు పాల్పడింది ప్రత్యక్షంగా నలుగురే అయినప్పటికీ ఆర్థికంగా, పరోక్షంగా పలువురు సహకరించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లాకేంద్రానికి చెందిన రాజలింగమూర్తి బుధవారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో హత్యకు గురైన విషయం తెలిసిందే. స్థానిక భూ వివాదం కారణంగానే ఈ హత్య జరిగినట్లు వెల్లడైంది. స్థానిక పోలీసులు తొలుత ఐదుగురిపై ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేశారు. అందులో ఏ-1 రేణుకుంట్ల సంజీవ్‌, ఏ-2 పింగిలి శ్రీమాంత్‌(బబ్లూ)లను హత్య జరిగిన రోజే అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఏ-3 మోరె కుమార్‌, ఏ-4 కొత్తూరి కుమార్‌ పట్టుకున్నారు. ఏ-5 రేణుకుంట్ల కొమురయ్యతోపాటు నిందితులకు కారు ఏర్పాటు చేసి, డ్రైవింగ్‌ చేసిన పట్టణంలోని సుభాష్‌కాలనీకి చెందిన ఓ డ్రైవర్‌ను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించినట్లు సమాచారం. అంతేకాక నిందితుల ఫోన్‌ కాల్‌ లిస్ట్‌ ఆధారంగా, అనుమానితులైన మరో నలుగురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

హరిబాబు హస్తం ఉందా..?

రాజలింగమూర్తి హత్య కేసులో భూపాలపల్లి మున్సిపాలిటీ మాజీ వైస్‌ చైర్మన్‌, బీఆర్‌ఎస్‌ నాయకుడు కొత్త హరిబాబు హస్తం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాజలింగమూర్తిని హత్య చేసిన అనంతరం నిందితులు.. ఓ వ్యక్తిని ఫోన్‌ అడిగి తీసుకొని హరిబాబుకు కాల్‌ చేసినట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ మేరకు హరిబాబును అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు శుక్రవారం రాత్రి రెడ్డి కాలనీలోని ఆయన ఇంటికి వెళ్లగా అందుబాటులో లేనట్లుగా తెలిసింది.

మరో వ్యక్తి ఆర్థిక సహకారం..

రాజలింగమూర్తి హత్యకు మరో వ్యక్తి ఆర్థికంగా సహకరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అటవీశాఖ ఆధీనంలో ఉన్న భూమి తనదేనంటూ కోర్టుకు వెళ్లిన ఒకరు ఆర్థికంగా నిందితులకు సహకరించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇతను కూడా పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.

రేపు లేదా ఎల్లుండి అరెస్ట్‌..

రాజలింగమూర్తి హత్య కేసును పూర్తిస్థాయిలో విచారణ జరిపి, నిందితులు ఎంతమంది ఉన్నారన్నది గుర్తించాక, ఆధారాలతో రేపు(ఆదివారం), లేదా సోమవారం అరెస్ట్‌ చూపించనున్నట్లు తెలుస్తోంది.

బైక్‌ అదుపుతప్పి వ్యక్తి మృతి


జమాలుద్దీన్‌ (ఫైల్‌)

స్టేషన్‌ఘన్‌పూర్‌ : ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో పడడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతుడి భార్య నూర్జహాన్‌, పోలీసుల కథనం ప్రకారం.. చిల్పూరు మండలం చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన ఎండీ.జమాలుద్దీన్‌ పశు వైద్యశాలలో ఆఫీస్‌ సబార్డినేట్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున పొంనూర్‌కు వెళ్తుండగా బైక్‌ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై వినయ్‌కుమార్‌, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.